ఉమ్మడి జిల్లాలో ఆరు కొవిడ్ కేసులు

కర్నూలు(న్యూసిటీ), జనవరి 11: ఉమ్మడి జిల్లాలో కరోనా విజృంభిస్తోంది. పండుగ సెలవుల నేపథ్యంలో గురువారం జిల్లాలో ఆరు కరోనా కేసులు నమోదైనట్లు కర్నూలు జీజీహెచ్ కరోనా నోడల్ ఆఫీసర్ డాక్టర్ మహేశ్వరరెడ్డి తెలిపారు. అవుకు, కర్నూలు, బండిమెట్ట, ముజఫర్‌నగర్‌లో ఒక్కో కేసు నమోదు కాగా కర్నూలు మండల పరిధిలోని వెంగన్నబావి గ్రామంలో ఇద్దరు పిల్లలకు కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ జరిగింది. ఇదిలా ఉండగా ఇప్పటి వరకు జిల్లాలో 23 కొవిడ్ యాక్టివ్ కేసులు ఉన్నట్లు జిల్లా వైద్యాధికారులు వెల్లడించారు.

బనగానపల్లెలో షాదీఖానా అని ప్రచారం చేస్తున్న నిర్మాణం ఇదే..



కమ్యూనిటీ హాళ్లకు షాదీఖానా ముసుగు..!

- బనగానపల్లె నియోజకవర్గంలో మూడు కమ్యూనిటీ హాళ్లు
- ఒక్కో చోట ఒక్కో వర్గం కోసమంటూ ప్రచారం
- బనగానపల్లె పట్టణంలోని నిర్మాణం కూడా అదేనంటూ పాట
- భవిష్యత్తులో ఆయా వర్గాల మధ్య ఇబ్బందులు తలెత్తే అవకాశం
- ఓట్ల కోసం మైనారిటీలను మభ్యపెడుతున్న ఎమ్మెల్యే

నంద్యాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి):

ఆయా వర్గాల వారు సమావేశాలు, సభలు ఏర్పాటు చేసుకునేందుకు, అభివృద్ధి కార్యక్రమాల సమీక్ష నిర్వహించుకునేందుకు, అధికారులు సందర్శించినప్పుడు సమావేశాలకు వీలుగా ప్రభుత్వం ఆయా నియోజకవర్గాల్లో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేపడుతోంది. ఈ నిర్మాణాలకు అనుమతులిచ్చే ముందు ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేస్తోంది. ఇందులోభాగంగానే బనగానపల్లె నియోజకవర్గంలో మూడు కమ్యూనిటీ హాళ్లకు అనుమతులిచ్చింది. అయితే స్థానిక ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఓట్ల కోసం ఆయా వర్గాలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాడు. బనగానపల్లెలో చేపట్టే కమ్యూనిటీ నిర్మాణానికి ఏకంగా షాదీఖానా ముసుగు తొడిగాడు. భూమి పూజ చేసే సమయంలో ముస్లిం మతపెద్దలతో పూజలు చేయించి మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేశామంటూ చెప్పుకొచ్చారు. ప్రభుత్వం మైనారిటీల కోసం షాదీఖానా నిర్మిస్తే ఎవరికీ ఏ అభ్యంతరం ఉండదని, కానీ ఇలా కమ్యూనిటీ హాలును మైనారిటీల కోసం నిర్మిస్తున్నామంటూ అబద్ధపు ప్రచారం చేయడం దేనికని, ఎమ్మెల్యేకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే.. షాదీఖానా నిర్మించి మైనారిటీలకు ఇవ్వాలని నియోజకవర్గ ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మూడు చోట్ల మూడు కమ్యూనిటీ హాళ్లు..

బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి బనగానపల్లె నియోజకవర్గంలోని బనగానపల్లె మండలంలోని కైప గ్రామంలో, అవుకు మండలంలో, కోయిలకుంట్ల మండలంలో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అందుకు ప్రభుత్వం అనుమతులిస్తూ గతేడాది జూలైలో ఉత్తర్వులు జారీ చేసింది. అవుకు మండలంలోని కమ్యూనిటీ హాలుకు రూ.1.20 కోట్లు, అలాగే కోవెలకుంట్ల కమ్యూనిటీ హాలుకు రూ.1.20 కోట్లు, కైప గ్రామంలోని కమ్యూనిటీ హాలుకు రూ.30 లక్షలు, మొత్తం మూడింటికి కలిపి రూ.2.70 కోట్లతో ఆయా కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు మొదలయ్యాయి. ఈ కమ్యూనిటీ ఫలానా వర్గానికి సంబంధించిన వారి కోసమే చేపడుతున్నట్లు ఎక్కడా లేదు. ఈ లెక్కన ఈ కమ్యూనిటీ హాళ్లను అన్ని వర్గాల ప్రజలు ఉపయోగించుకోవచ్చు. అయితే ఇక్కడే ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తన మార్కు రాజకీయం మొదలు పెట్టాడు. ఫలానా వర్గం వారి కోసమే కమ్యూనిటీ హాళ్లు నిర్మిస్తున్నామంటూ ప్రచారం మొదలుపెట్టాడు. కోవెలకుంట్లలో మొదలుపెట్టిన కమ్యూనిటీ హాలుకు ఏకంగా ముస్లిం మతపెద్దలతో ప్రార్థనలు చేయించి, ఈ నిర్మాణం షాదీఖానా అంటూ మైనారిటీలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. దీనికి తోడు బనగానపల్లెలో మొదలుపెట్టిన కమ్యూనిటీ హాలు కూడా షాదీఖానా అంటూ మైనారిటీలను మోసం చేసే ప్రయత్నం జరుగుతున్నట్లు స్థానికంగా ప్రచారం సాగుతోంది. నిజంగా ఈ రెండు షాదీఖానాలే అయితే వీటి నిర్మాణాలకు సంబంధించిన ఉత్తర్వులు ప్రత్యేకించి మైనారిటీ శాఖ నుంచి వెలువడి ఉండేవి. కానీ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టంగా కమ్యూనిటీ హాలు నిర్మాణమే చెప్పింది. ఇలా ప్రభుత్వం ఇచ్చిన జీవోను దాచిపెట్టి ప్రజలకు మేలు వచ్చే ఎన్నికల్లో మైనారిటీలను మచ్చిక చేసుకునేందుకు కమ్యూనిటీ హాలుకు షాదీఖానా ముసుగు తొడిగారన్న విమర్శలు స్థానికులు నుంచి వ్యక్తమవుతున్నాయి.

పార్కు స్థలంలో..

ప్రజలకు మేలు చేయదలిచిన ప్రజా ప్రతినిధి వారి కోసం చేపట్టే నిర్మాణాల విషయానికి సంబంధించి భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకుంటాడు. అయితే ఎమ్మెల్యే రూటే సపరేటు.. అధికారంలో ఉన్నది తామే కాబట్టి, తాము ఏం చేసినా అడిగేది ఎవరు అనుకున్నాడో ఏమో? బనగానపల్లెలో షాదీఖానా ఏకంగా పార్కు స్థలంలో మొదలుపెటారు. ఈ నిర్మాణం చేపట్టిన పార్కు స్థలం బనగానపల్లె గ్రామ పంచాయతీ భానుముక్కల ప్రాంతంలోని సర్వే నంబరు 145పీ, 146, 147, 160/1ఏ, 160/3 లే అవుట్‌కు సంబంధించిన పార్కు స్థలంగా రికార్డులు చూపుతున్నాయి. ఏదైనా లే అవుట్ వేసినపుడు పార్కు కోసం ప్రత్యేకంగా స్థలం విడిచి పెట్టాల్సి ఉంటుంది. ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయి. ఒకవేళ భవిష్యత్తులో ఎవరైనా పార్కు కోసం కేటాయించిన స్థలంలో ఇతర నిర్మాణాలు చేపట్టారని కోర్టుకు ఎక్కితే ప్రస్తుత నిర్మాణం చిక్కుల్లో పడే ప్రమాదం ఉంది. ఎమ్మెల్యే స్థాయి వ్యక్తికి ఇంత చిన్న విషయం తెలియకుండా పోతుందా? అన్న అనుమానం వ్యక్తం అవుతోంది. తెలిసే ఎమ్మెల్యే నిర్మాణాన్ని చేపట్టాడని, అధికారం ఉందన్న కారణంతో ఇలా చేస్తున్నాడన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.



టీడీపీ హయాంలో బీసీ జనార్దన్ రెడ్డి చేపట్టిన షాదీఖానా నిర్మాణం (ప్రస్తుతం వైసీపీ హయాంలో ఆ పనులను నిలిపివేయించారు)



బనగానపల్లెలో షాదీఖానా నిర్మిస్తున్న ప్రాంతానికి చెందిన లేఅవుట్

భవిష్యత్తులో సమస్యలు వస్తే..

కమ్యూనిటీ హాలు అంటే అన్ని వర్గాల వారు ఉపయోగించుకోవడానికి వీలుగా ఉంటుంది. కానీ ఎమ్మెల్యే అనుచరులు చేస్తున్న అబద్ధపు ప్రచారం వల్ల కొంత మందికి మాత్రమే ఈ కమ్యూనిటీ హాలుపైన హక్కులు చెలాయించే అవకాశం ఉంది. గతేడాది అవుకులో మాట్లాడుతూ ఫలానా వారి కోసమే కమ్యూనిటీ హాలు నిర్మిస్తున్నామంటూ చెప్పుకొచ్చారు. ఎమ్మెల్యే చెప్పాడన్న ఉద్దేశంలో హాలు నిర్మాణం పూర్తయిన తర్వాత సదరు వర్గం వారు మిగిలిన వారిని వాడుకోనివ్వకపోతే ఆయా వర్గాల మధ్య విభేదాలు తలెత్తే అవకాశం ఉంది. ఇక షాదీఖానాలు అనగానే అవి పూర్తిగా మైనారిటీలకు మాత్రమే చెందుతాయి. కానీ ఎమ్మెల్యే ప్రస్తుతం చేపడుతున్న ఏ నిర్మాణం కూడా షాదీఖానాలు కావు. అవి పూర్తిగా కమ్యూనిటీ హాళ్లు అని అంటున్నారు టీడీపీ నేతలు. అధికార పార్టీ నేతలు తమ సొంత ఇమేజి పెంచుకోవడానికి చేసే అబద్ధపు ప్రచారాల వల్ల అన్నదమ్ముల్లాగా కలిసి ఉంటున్న వారి మధ్య సఖ్యత లేకుండా పోతుందన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

ఎన్నికల ముందు హడావుడి..

గత ప్రభుత్వ హయాంలో టీడీపీ మొదలుపెట్టిన పనులను వైసీపీ నాయకులు ఎన్నికల స్టంట్‌గా వర్ణించేవారు. అదే వైసీపీ వారు ప్రస్తుతం మొదలుపెట్టిన పనులను మాత్రం ప్రజా సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలు అని గొప్పలు చెబుతున్నారు. అందుకు బనగానపల్లె కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చక్కటి ఉదాహరణగా నిలుస్తోంది. అవుకు, కైప, కోవెలకుంట్లలో చేపట్టిన నిర్మాణాల కోసం ప్రభుత్వం నుంచి అనుమతులను గతేడాది జూలైలో ప్రతిపాదనలు పంపించారు. ఇక బనగానపల్లెలో కమ్యూనిటీ హాలు ముసుగులో నిర్మిస్తున్న షాదీఖానాకు అనుమతులు గత ఏడాది జనవరిలో వచ్చాయి. ఈ ఉత్తర్వుల్లో కూడా రూ.1.20 కోట్లతో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి అనుమతిస్తున్నట్లు ఉంది. స్థానిక ఎమ్మెల్యే సంవత్సరం కింద అనుమతులు వచ్చిన దానినే కాకుండా, కమ్యూనిటీ హాలు అనే నిజాన్ని కూడా దాచిపెట్టాడు. పైగా దీనికి సంబంధించిన నిర్మాణాన్ని ఎన్నికలకు సరిగ్గా ఆరు నెలలు ఉందనగా అక్టోబరులో మొదలుపెట్టించాడు. ఈ స్థాయిలో నిజాలను దాచిపెట్టి, అబద్ధపు మాటలు చెబుతూ మైనారిటీలను ఎందుకు మోసగించాల్సి వచ్చిందో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికే తెలియాలని స్థానిక మైనారిటీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కోవెలకుంట్లలో షాదీఖానా అని ప్రచారం చేస్తున్న నిర్మాణం

చిత్తశుద్ధి ఉంటే గతంలో ఎందుకు అడ్డుకున్నారు..?



టీడీపీ ప్రభుత్వ హయాంలో బనగానపల్లెలోని షాదీఖానా నిర్మాణానికి సొంత నిధులను విరాళంగా ఇస్తున్న అప్పటి ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి మైనారిటీల బాగు కోసం షాదీఖానా నిర్మించేందుకు సిద్ధమయ్యారు. ఇందుకోసం అవసరమైన అనుమతులను ప్రభుత్వం నుంచి 2018లో తీసుకు రావడమే కాకుండా, రూ.30 లక్షలు విరాళంగా కూడా ఇచ్చారు. అంతేకాకుండా షాదీఖానా నిర్మాణం త్వరితగతి న పూర్తయ్యేందుకు సొంత డబ్బులు దాదాపు రూ.40 లక్షలు ఖర్చు పెట్టి నిర్మాణాన్ని చేపట్టారు. మొత్తమ్మీద బీసీ తన సొంత డబ్బులను రూ.70 లక్షలు ఖర్చు పెట్టుకుని దాదాపు 70 శాతం పూర్తయింది. మిగిలిన నిర్మాణం పూర్తి చేసే సమయానికి ప్రభుత్వం మారడంతో షాదీఖానా నిర్మాణం ఆగిపోయింది. ఆ తర్వాత ఎమ్మెల్యేగా ఎన్నికైన రామిరెడ్డి దాని గురించి పూర్తిగా పట్టించుకోలేదు. దీనికి తోడు అసంపూర్తిగా ఉన్న షాదీఖానాను సొంత డబ్బుతోనే పూర్తి చేస్తానని చెబుతున్న బీసీపైన పోలీసు కేసులు పెట్టి వేధిస్తున్నాడు. నిజంగా మైనారిటీల మీద ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి ప్రేమ ఉంటే, వారికోసం షాదీఖానాను నిర్మించేంత చిత్తశుద్ధి ఉంటే.. ఆగిపోయన నిర్మాణాన్ని ఎపుడో చేపట్టి ఉండేవారు. బనగానపల్లె నియోజకవర్గ ముస్లింలకు షాదీఖానా నాలుగేళ్ల కిందటే అందుబాటులోనికి వచ్చేది. ముఖ్యంగా ప్రజాధనం వృథాగా ఖర్చు అయ్యేది కాదు.

రాయలసీమను ఎన్నాళ్లు మోసం చేస్తారు..?

- సాగు నీటిపై నిర్దిష్టమైన ప్రణాళికలు చేయాల్సిందే
- రాయలసీమ సాగునీటి సమితి వ్యవస్థాపకుడు బొజ్జా దశరథరామిరెడ్డి



మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

ఆత్మకూరు, జనవరి 11: రాయలసీమలో కరువు ఉందంటూ ప్రజలకు మభ్యపెట్టే మాటలతో రాజకీయ పార్టీలు ఎన్నాళ్లు మోసం చేస్తాయని రాయలసీమ సాగునీటి సమితి వ్యవస్థాపకుడు బొజ్జా దశరథ రామిరెడ్డి ప్రశ్నించారు. సిద్దేశ్వరం అలుగు నిర్మాణ ప్రజా ఉద్యమంలో నమోదైన కేసుకు సంబంధించి గురువారం ఆత్మకూరు కోర్టులో ఆయన వాయిదాకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాయలసీమలో కరువు ఉందని, అందుకే గోదావరి జలాలను తరలిస్తామని మభ్యపెట్టే మాటలపై ప్రజలకు వాస్తవ పరిస్థితులను తెలియజేసేందుకే 2016 మే 31న సిద్దేశ్వరం అలుగు నిర్మాణ ప్రజా ఉద్యమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అమరావతికి భూములు ఇచ్చిన రైతులకు లక్షల రూపాయల లీజులు, వాణిజ్య స్థలాలు, ఇళ్ల స్థలాలు ఇచ్చి ఆదుకుంటున్న ప్రభుత్వాలు శ్రీశైలం నీటి ముంపు బాధితులపై వివక్ష చూపడం సరికాదని అన్నారు. భూములు కోల్పోయి అన్ని విధాలుగా నష్టపోయిన తమకు నీరివ్వకుండా అన్ని రాజకీయ పార్టీలు అన్యాయం చేస్తున్నారని అన్నారు. నిజానికి బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం రాయలసీమకు నీటి కేటాయింపులు ఉన్నప్పటికీ 40 శాతం భూ భాగానికి నీరందడం లేదని అన్నారు. ఏటా కృష్ణా జలాలు సముద్రపు పాలవుతున్నా రాయలసీమ ప్రాంతంలో ఉపయోగించుకోలేని పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన పంట కాలువలు లేకపోవడం వల్ల కర్నూలులోని తుంగభద్ర దిగువ కాలువ 1.55 లక్షల ఎకరాలకు నీరు పారాల్సి ఉంటే 55 వేల ఎకరాలకు, ఎగువ కాల్వ 2.85 లక్షల ఎకరాలకు నీరు పారాల్సి ఉంటే 85 వేల ఎకరాలకు మాత్రమే నీరందించాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. అలాగే బ్రహ్మసాగర్ రిజర్వాయర్ ద్వారా 1.20 లక్షల ఎకరాలకుగాను 30 వేల ఎకరాలకు నీరందించినట్లు చెప్పారు. కేవలం రూ.85 లక్షలు ఖర్చు చేయలేక ఐదేళ్లుగా అలగనూరు రిజర్వాయర్‌ను గాలికి వదిలేశారని మండిపడ్డారు. ఇకనైనా రాజకీయ పార్టీలు సూటిగా సమాధానం చెప్పి రాయలసీమ ప్రాంత అభివృద్ధికి నిర్దిష్టమైన ప్రణాళిక చూపకపోతే ఈ ప్రాంత ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

నంద్యాలలో ఫ్లెక్సీల వివాదం

- మతపరమైన ఫ్లెక్సీల ఏర్పాటు
- దహనం చేసిన టీడీపీ శ్రేణులు
- ఎస్పీకి ఫిర్యాదు చేసిన నాయకులు

నంద్యాల క్రైం/ నంద్యాల (నూనెపల్లె), జనవరి 11: నంద్యాలలో బుధవారం అర్ధరాత్రి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఫ్లెక్సీల వివాదం చోటు చేసుకుంది. బీజేపీ, టీడీపీ, జనసేన మూడు పార్టీలు ఒక్కటేనంటూ ఒక వర్గానికి చెందిన మతపరమైన కామెంట్లతో విద్వేషకర ఫ్లెక్సీలను కొంత మంది ఏర్పాటు చేశారు. ఇది కాస్తా దుమారంగా రేపింది. ఫ్లెక్సీలను కడుతున్న వ్యక్తులను టీడీపీ శ్రేణులు అదుపులోకి తీసుకున్నాయి. ఫ్లెక్సీలను చించివేసి గాంధీ చౌక్ సెంటర్‌లో దహనం చేశారు. ఈ ఘటనతో గాంధీచౌక్ సెంటర్‌లో టీడీపీ నాయకులు ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. సంఘటనా స్థలానికి చేరుకున్న వన్‌టౌన్ సీఐ చలపతికి టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో బ్యానర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా బ్యానర్లు కట్టిన వ్యక్తిని 'ఎందుకు కట్టావు.. ఎవరు కట్టమని చెప్పారు..' అని ప్రశ్నించగా... అధికార పార్టీ నాయకులు కట్టమంటే కట్టానని బ్యానర్ల వివాదానికి తనకు ఏలాంటి సంబంధం లేదని చెప్పుకొచ్చారు. ఈ ఘటనపై చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ సీఐ టీడీపీ నాయకులు నచ్చజెప్పడంతో అక్కడి నుంచి వెనుదిరిగారు.

ఎస్పీకి ఫిర్యాదు చేసిన టీడీపీ నాయకులు: నంద్యాలలో అర్ధరాత్రి చోటు చేసుకున్న వివాదాస్పద ఫ్లెక్సీలను ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ తీసుకొని ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, నంద్యాల అసెంబ్లీ టీడీపీ ఇన్‌చార్జి ఎన్ఎండీ ఫరూక్ వర్గం నాయకులు ఎస్పీ కార్యాలయానికి గురువారం చేరుకున్నారు. విడివిడిగా ఎస్పీ రఘువీర్‌రెడ్డికి వినతి పత్రాలు అందజేశారు. మతాలకు అతీతంగా స్నేహ భావంతో మెలుగుతున్న నంద్యాల ప్రజలలో మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా వాదాస్పద బ్యానర్లను ఏర్పాటు చేయడం చట్ట వ్యతిరేకమని అన్నారు. బ్యానర్ల ఏర్పాట్లు వెనుక ఉన్న అధికార పార్టీ నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఎస్పీకి వినతి పత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి



వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఆడుదాం ఆంధ్రలో

కొట్టుకున్నారు..

యువకుల మధ్య చిచ్చురేపిన క్రీడలు



నందికొట్కూరు జూనియర్ కాలేజీ గ్రౌండ్ లో కుర్చీలతో కొట్టుకుంటున్న క్రీడాకారులు

నందికొట్కూరు రూరల్, జనవరి 11: ఆడుదాం ఆంధ్ర క్రీడాస్ఫూర్తితో సాగాల్సిన ఆడుదాం ఆంధ్ర పోటీలు వివాదాలకు, ఘర్షణలకు కేంద్రీకృతమవుతున్నాయి. పచ్చని గ్రామాల్లో ఈ 'రాజకీయ' క్రీడలు చిచ్చురేపుతున్నాయి. తాజాగా గురువారం నందికొట్కూరు, గోస్పాడు మండలాల్లో యువకులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. పిడిగుద్దులు గుద్దుకున్నారు. కుర్చీలతో ఒకరినొకరు కొట్టుకున్నారు. నందికొట్కూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'ఆడుదాం ఆంధ్ర' క్రీడలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కబడ్డీ ఆడుతున్న శాతనకోట, నాగటూరు గ్రామాలకు చెందిన క్రీడాకారులు ఒకరిపై ఒకరు దూషణలు చేసుకున్నారు. ఆడుదాం ఆంధ్రకు సంబంధించిన టీషర్టుల పంపిణీ గొడవకు కారణమైంది. ఈ క్రమంలో మాటామాటా పెరిగి అందరూ చూస్తుండగానే ఒకరిపై ఒకరు పడి కొట్టుకున్నారు. చివరకు పోలీసులు రంగప్రవేశం చేసి యువకులను చెదరగొట్టారు.

గోస్పాడులోనూ ఘర్షణ

గోస్పాడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో గురువారం యువకుల మధ్య తీవ్ర ఘర్షణ చోటు చేసుకుంది. గోస్పాడులోని మోడల్ స్కూల్ గ్రౌండ్‌లో గోస్పాడు, కానాలపల్లె జట్ల మధ్య కబడ్డీ పోటీలు జరిగాయి. అయితే ఆట మధ్యలో ఇరు జట్లు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఒకరిపై ఒకరు పిడిగుద్దులతో దాడులు చేసుకున్నారు. కానాలపల్లె జట్టుకు మద్దతుగా, గోస్పాడు జట్టుకు మద్దతుగా వచ్చిన వారు ఘర్షణకు దిగారు. దీంతో నిర్వాహకులకు ఇబ్బంది కలగడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఆటల పోటీలు జరుగుతున్న గోస్పాడు మోడల్ స్కూల్ గ్రౌండ్‌కు వచ్చిన పోలీసులు ఘర్షణను అడ్డుకుని యువకులకు సర్ది చెప్పారు. అనంతరం ఇరు జట్లకు చెందిన పలువురు మద్దతుదారులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి కొద్దిసేపు తర్వాత పంపించారు.

హరివిల్లు.. సిరిజల్లు..

వైభవంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్

కలర్‌ఫుల్ : రంగులమయమైన నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని టెన్నిస్ కోర్టు





ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

"ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్‌బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్స్ స్వర్గసీమ సుకేతన" ఫైనల్స్ గురువారం విజయవాడలో అంగ'రంగుల' వైభవంగా జరిగాయి. బెంజిసర్కిల్ సమీపంలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీ టెన్నిస్ కోర్టులో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల స్థాయిలో విజేతలుగా నిలిచిన మహిళలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కూడా పాల్గొన్నారు. తమ సృజనతో ముత్యాల ముగ్గుల్లో రంగుల దృశ్యాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ ఏజీఎం జీవీ నరసింహారావు, కెనరా బ్యాంక్ మార్కెటింగ్ సర్కిల్ సీనియర్ మేనేజర్ శిరీష, 'ఆంధ్రజ్యోతి' న్యూస్ ఎడిటర్ నాగసుధాకర్, 'ఆంధ్రజ్యోతి' విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ, ఏబీఎన్ ఏపీ బ్యూరో బి.రామారావు, యాడ్స్ ఏజీఎం టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, మల్లెల శుభప్రద వ్యవహరించారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

ప్రథమ బహుమతి గెలుచుకున్న విజయనగరం జిల్లా మహిళ

గుంటూరు, అనంతపురం, తమిళనాడు మహిళలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



పరిశీలన : ముగ్గులను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

రెండుసార్లు రాష్ట్రస్థాయి బహుమతి పొందా..



నేను టైలరింగ్ చేస్తాను. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నప్పటి నుంచీ పాల్గొంటున్నా. హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించాను. తర్వాత 2023లో నిర్వహించిన పోటీల్లో రెండోసారి ప్రథమ బహుమతిని పొందాను. మళ్లీ ఇప్పుడు ద్వితీయ బహుమతి పొందా.

- కె.ఉమాదేవి, అనంతపురం జిల్లా

ద్వితీయ బహుమతి విజేతలు

ఐదేళ్లుగా ముగ్గులు వేస్తున్నా



మాది సత్తెనపల్లి వద్ద ఉన్న ధూళిపాళ్ల గ్రామం. ఐదేళ్లుగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. జిల్లాస్థాయి పోటీల్లో రెండుసార్లు ప్రథమ బహుమతి సాధించాను. 2020లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మొదటి స్థానం నాదే.

- ఏ.సునీత, గుంటూరు జిల్లా

పదేళ్లుగా పోటీల్లో ఉంటున్నా..



కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో ఏటా నేను పాల్గొంటా. పదేళ్లుగా నేను ముగ్గులు వేస్తున్నా. తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ పోటీల్లో ద్వితీయ బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది.

- రాధ, తమిళనాడు



విజేతలు వీరే.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నుంచి ద్వితీయ బహుమతులు అందుకుంటున్న ఏ.సునీత (గుంటూరు), కె.ఉమాదేవి (అనంతపురం), కె.రాధ (తమిళనాడు), కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న ఆర్.ఆశాజ్యోతి (శ్రీకాకుళం), బి.లక్ష్మి (విశాఖపట్నం), టి.ఆదిశ్రీ (పశ్చిమగోదావరి), మల్లీశ్వరి (తూర్పుగోదావరి), పి.పూజిత (కృష్ణా), ఎం.సునీత (నెల్లూరు), సీహెచ్ మణిమంజరి (ప్రకాశం), విద్య (చిత్తూరు), ఎస్.శ్వేత (కడప), ఎస్.రాజేశ్వరి (కర్నూలు), లిఖిత (కర్ణాటక)

నవరత్నాల రథంపై దర్శనమిచ్చిన ప్రహ్లాదరాయలు



వెండి రథాన్ని లాగుతున్న సినీ దర్శకుడు పూరీ జగన్నాథ్ తనయుడు పూరీ ఆకాష్

మంత్రాలయం, జనవరి 11: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు నవరత్నాల రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. రాఘవేంద్రస్వామి సజీవ సమాధి పొందిన గురువారం అమావాస్య శుభదినాన్ని పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బృందావనానికి క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకం చేసి వెండి, బంగారు, పట్టు వస్త్రాలతో శోభాయమానంగా అలంకరించారు. పూర్ణబోధ పూజ మందిరంలో మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు కనకాభిషేకం చేశారు. బెంగళూరుకు చెందిన భగీర్థత అనే భక్తురాలు అన్నదానానికి రూ.లక్ష విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషిలు తెలిపారు. మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటకలోని అదమారు మఠం పీఠాధిపతి విశ్వప్రియ తీర్థ స్వామీజీ, ప్రముఖ సినీ దర్శకుడు పూరీ జగన్నాథ్ తనయుడు సినీనటుడు పూరీ ఆకాష్ గురువారం వేర్వేరు సమయాల్లో మంత్రాలయం వచ్చారు. వీరికి మఠం అధికారులు ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు శ్రీనివాసరావు, వెంకటేష్ జోషిలు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. పూరీ ఆకాష్ వెండి రథం లాగి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీరాఘవేంద్ర స్వామికి ఇష్టమైన దినం, అమావాస్య కావటంతో దక్షిణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు.

కుమారుడి వద్దకు వెళ్తూ.. తిరిగిరాని లోకాలకు

గడివేముల, జనవరి 11 : సంక్రాంతి పండుగను కుమారుడి వద్ద జరుపుకునేందుకు కుటుంబ సభ్యులతో వెళ్తున్న ఓ తల్లి రోడ్డు ప్రమాదానికి గురై తిరిగిరాని లోకాలకు వెళ్లిన హృదయ విదారక ఘటన గడివేములలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మిడ్తూరు మండలం చెరుకుచర్ల గ్రామానికి చెందిన కస్తూరయ్య, పద్మావతమ్మల కుమారుడు రాజలింగేశ్వరయ్య మహానంది దేవస్థానంలో అర్చకుడిగా పని చేస్తున్నాడు. సంక్రాంతి పండుగ సందర్భంగా కుమారుడి వద్ద పండుగ చేసుకునేందుకు తల్లిదండ్రులు కస్తూరయ్య, పద్మావతమ్మతో పాటు మనుమరాలు త్రిపుర ద్విచక్ర వాహనంపై చెరుకుచర్ల నుంచి మహానందికి గురువారం బయలుదేరారు. గడివేములలోని సినిమా హాల్ సమీపంలోకి రాగానే బైక్‌ను భారీ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో పద్మావతమ్మ(56) వాహనం టైర్ల కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. కస్తూరయ్య గాయాలపాలయ్యాడు. పద్మావతమ్మ కళ్లెదుటే మృత్యువాత పడడంతో భర్త కస్తూరయ్య విలపించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బీటీ వెంకట సుబ్బయ్య తెలిపారు.

డిగ్రీలో 12 మంది డీబార్

కర్నూలు(అర్బన్), జనవరి 11: డిగ్రీ 3వ సెమిస్టర్‌లో 12 మంది డీబార్ అయ్యారని పరీక్షల విభాగం కన్వీనర్ డాక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో 3,830 మంది దరఖాస్తు చేసుకోగా 3,385 మంది పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు.

తమ్మడపల్లిలో రూ.3 లక్షలు చోరీ

మహానంది, జనవరి 11: మహానంది మండలం తమ్మడపల్లిలోని సోమన్న అనే వ్యక్తి ఇంట్లో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి రూ.3 లక్షల నగదుతో పాటు ఆరు తులాల బంగారు నగలు దోచుకెళ్లారని బాధితుడు సోమన్న తెలిపారు. తాము ఇంట్లో నిద్రిస్తుండగా దొంగతనం జరిగిందన్నాడు. గురువారం ఉదయం ఫిర్యాదు అందుకున్న మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ సిబ్బందితో వెళ్లి పరిశీలించారు.

కర్నూలు ఎంపీ అభ్యర్థిగా జయరాం

- వైసీపీ మూడో జాబితా విడుదల
- ఆలూరుకు చిప్పగిరి జడ్పీటీసీ విరుపాక్షి
- కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్‌కు చెక్.. డాక్టర్ సతీశ్‌కు చాన్స్



కర్నూలు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నుంచి మంత్రి గుమ్మనూరు జయరాంను తప్పించి కర్నూలు ఎంపీగా ఛాన్స్ ఇచ్చారు. సీఎం జగన్ అడుదాం సీట్లాటలో కోడుమూరు (ఎస్సీ) నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌ను అవుట్ చేశారు. అక్కడ డాక్టర్ ఆదిమూలపు సతీశ్‌కు అవకాశం ఇచ్చారు. జగన్ తీసుకున్న నిర్ణయంతో సుధాకర్ వర్గీయులు తీవ్ర ఆగ్రహంతో రగలిపోతున్నారు. అదే క్రమంలో ఆలూరు సీటు వైరి వర్గానికి చెందిన చిప్పగిరి జడ్పీటీసీ విరుపాక్షికి ఇచ్చి జయరాంకు ఎంపీ టికెట్ ఇవ్వడంపై మంత్రి వర్గీయులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇప్పటి వరకు అభ్యర్థులను ప్రకటిస్తూ మూడు జాబితాలు విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలో కర్నూలు ఎంపీ, ఆలూరు, ఎమ్మిగనూరు, కోడుమూరు (ఎస్సీ) ఇన్‌చార్జిల (రాబోయే ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు)ను ఖరారు చేశారు. నంద్యాల లోక్‌సభ ఎంపీ సహా 11 నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉంది. తెరపైకి కొత్తకొత్త వ్యక్తులు వస్తుండటంతో రాబోయే జాబితాలో మా పేరు ఉంటుందా..? సీఎం జగన్, సజ్జల, ధనుంజయ రెడ్డి, మిథున్‌రెడ్డిలు ఆడే సీట్లాటలో మా టికెట్ గల్లంతు అవుతుందా..? అనే టెన్షన్‌లో ఎమ్మెల్యేలు ఉన్నారు. అన్ని విధాలుగా క్లీయర్‌గా ఉన్నప్పుడు మూడో జాబితాలో పేరు ఎందుకు లేదు..? అనే ప్రశ్న వారిని వేధిస్తోంది.

ఆలూరు నుంచి జయరాం అవుట్

ఆలూరు వైసీపీ టికెట్ కోసం మంత్రి గుమ్మనూరు జయరాం చివరి వరకు ప్రయత్నాలు సాగించారు. ఆయన ప్రయత్నాలు ఫలించలేదు. తనకు రాజకీయంగా వైరివర్గంగా ఎదుగుతున్న బి.విరుపాక్షినే ఎంపిక చేశారు. జయరాంకు జూన్ 19న చెప్పినట్లుగా కర్నూలు పార్లమెంట్ ఇన్‌చార్జి (ఎంపీ అభ్యర్థి)గా ఎంపిక చేశారు. ఆలూరు టికెట్ ఇవ్వనందుకు బాధపడాలో.. ఎంపీ టికెట్ ఇచ్చినందుకు సంతోష పడాలో తెలియని పరిస్థితి జయరాం వర్గీయులది. అయితే తమకు ఆలూరు టికెట్ ఇవ్వనందుకు బాధలేదు కానీ... విరుపాక్షికి ఇవ్వడం నచ్చలేదని మంత్రి వర్గీయులు అంటున్నారు. మంత్రి జయరాం, ఆయన సోదరులకు మింగుడు పడడం లేదు. ఎలాగైనా విరుపాక్షికి టికెట్ రాకుండా అడ్డుకోవడానికి జయరాం శతవిదాల ప్రయత్నాలు చేశారు. ఈ నెల 5న సీఎం జగన్‌ను కలసిన మంత్రి జయరాం తనకు ఆలూరు టికెట్ ఇవ్వకపోయిన పర్వాలేదు.. ఆదోని ఉంటున్న వాల్మీకి సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్‌కు ఇవ్వండి గెలిపించుకు వస్తానని జగన్‌పై ఒత్తిడి తెచ్చినా ఫలితం లేకుండా పోయింది.

సుధాకర్ అవుట్.. సతీశ్ ఇన్



కోడుమూరు (ఎస్సీ) నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అవుట్ అయ్యారు. ఆ స్థానంలో కర్నూలు నగరం ఏ క్యాంపులో ఉన్న రాయలసీమ క్రిస్టియన్ కాలేజీస్ విద్యా సంస్థల అధినేత, డాక్టర్ ఆదిమూలపు సతీశ్‌కు అవకాశం ఇచ్చారు. కోడుమూరు వైసీపీ ఇన్‌చార్జిగా మూడో జాబితాలో స్థానం కల్పించారు. ఈయన సోదరుడు ఆదిమూలపు సురేశ్ జగన్ కేబినేట్‌లో మంత్రిగా కొనసాగుతున్నారు. కోడుమూరు నుంచి వైసీపీ టికెట్ కోసం తాజా ఎమ్మెల్యే సుధాకర్, మాజీ ఎమ్మెల్యేలు మణిగాంధీ, మురళీకృష్ణ తదితరులు ప్రయత్నించారు. కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి సిఫారసు మేరకు సీఎం జగన్ సతీశ్‌కు అవకాశం ఇవ్వడం కొసమెరుపు. సిట్టింగ్ ఎమ్మెల్యే సుధాకర్‌కు కనీస సమాచారం కూడా ఇవ్వకుండా సతీశ్‌ను ఇన్‌చార్జిగా ఎంపిక చేయడంపై ఆయన వర్గీయులు ఆగ్రహంతో రగిలిపోతున్నారు.

విరుపాక్షికి కలిసొచ్చిన అదృష్టం



చిప్పగిరి జడ్పీటీసీ బి.విరుపాక్షిని ఆలూరు నియోజకర్గం వైసీపీ ఇన్‌చార్జిగా నియమించారు. మంత్రి గుమ్మనూరు జయరాంతో రాజకీయ విభేదాలే ఆయనకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం వచ్చింది. జడ్పీటీసీగా ఆయనకు ఇవ్వాల్సిన ప్రాధాన్యత ఇస్తూ రాజకీయ ఎదుగుదులకు ప్రోత్సహించి ఉంటే ఈ రోజుకు మంత్రి జయరాంను కాదని టికెట్ తెచ్చుకునే పరిస్థితి వచ్చేది కాదు. మంత్రి గుమ్మనూరు జయరాం, ఆయన సోదరులు విరుపాక్షిని రాజకీయంగా తొక్కిపెట్టాలనుకున్నారు.. అదే వేగంతో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా సీఎం జగన్ గుర్తించేలా ఎదిగారని ఆయన వర్గీయులు అంటున్నారు. బుధవారం సీఎం జగన్ తాడేపల్లి ప్యాలెస్‌కు పిలిపించి టికెట్ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ విషయం తెలిసి విరుపాక్షి వర్గీయులు ఆలూరు, చిప్పగిరిలో బాణసంచా పేల్చారు. ఇది నచ్చని మంత్రి వర్గీయులు వారిపై దాడి చేశారని విరుపాక్షి వర్గీయులు ఆరోపిస్తున్నారు. గురువారం మంత్రి జయరాం బంధువు శ్రీధర్, విరుపాక్షి వర్గీయుడు పెద్ద పెద్దయ్యల మధ్య ఇదే విషయంలో వాగ్వాదానికి దారితీసింది. ఇక్కడి నుంచి వైసీపీ టికెట్ కోసం దివంగత మాజీ ఎమ్మెల్యే పాటిల్ నీరజారెడ్డి కుమార్తె ఎన్‌ఆర్‌ఐ పాటిల్ హిమవర్షిణిరెడ్డి, తెర్నేకల్లు సురేంద్రరెడ్డి, మధుసూధన్‌రెడ్డి, బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ, టీడీపీని వీడి వైసీపీలో చేరిన కప్పట్రాళ్ల బొజ్జమ్మ సహా పలువురు ప్రయత్నించినా చివరికి విరుపాక్షి వైపే జగన్ మొగ్గు చూపారు.

చంద్రబాబు సభలను విజయవతం చేద్దాం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు



కర్నూలు(అర్బన్), జనవరి 11: 'రా..కదలి రా' పిలుపుతో చంద్రబాబు నిర్వహిస్తున్న సభలను విజయవంతం చేయలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు పార్టీ శ్రేణులను కోరారు. గురువారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీటీ నాయుడు మాట్లాడారు. 2019 తర్వాత రాష్ట్రంలో అరాచక, అవినీతి, హత్యరాజకీయ, కూల్చివేతలు, దాడులు, రద్దులు, అక్రమాలతో జగన్ పాలన మొదలైందన్నారు. జగన్ మాదిరిగానే వైసీపీ నాయకులు, ఆ పార్టీ నుంచి నెగ్గిన ప్రజాప్రతినిధులు ప్రజా ఆస్తులను దోచేస్తున్నారని ఆరోపించారు. అప్రజాస్వామిక విధానాలను ప్రజలకు వివరించి, వారిలో చైతన్యం తీసుకొచ్చేందుకు టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్ని పార్లమెంట్ పరిధిలో 'రా..కదలిరా' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ బహిరంగ సభలను విజయవతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు ఉత్సాహంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని కాపాడి రాష్ట్రానికి స్వర్ణ యుగం తీసుకురావడమే టీడీపీ లక్ష్యమని బీటీ నాయుడు పేర్కొన్నారు.

సొమ్ము కేంద్రానిది.. సోకు రాష్ట్రానిది : బీజేపీ

గోస్పాడు, జనవరి 11: కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు పంపిస్తుంటే వాటిని రాష్ట్రంలోని వైసీపీ సర్కార్ తమ సొంత పేర్లు పెట్టుకొని ప్రచారం చేసుకుంటూ సొమ్ము ఒకరిది.. సోకు మరొకరిది అన్న చందంగా ఉందని నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ అభిరుచి మధు రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. గురువారం గోస్పాడులో సంక్రాంతి పండుగ సందర్భంగా అభిరుచి సేవా సమితి ఆధ్వర్యంలో పేదలకు చీరెలు పంపిణీ చేశారు. అభిరుచి మధు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను సబ్సిడీతో అందిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మధుగోపాల్, మాజీ సర్పంచు నాగేష్, బాలు పాల్గొన్నారు.

'జగనన్న తోడు పథకం ద్వారా లబ్ధి'

నంద్యాల (కల్చరల్), జనవరి 11: జగనన్న తోడు పథకం ద్వారా జిల్లాలో 14,763 మంది లబ్ధిదారులకు రూ.31.55 లక్షల రుణాలు పంపిణీ, 14,142 మంది లబ్ధిదారులకు రూ.14.96 కోట్ల వడ్డీని రీయింబర్స్‌మెంట్ ద్వారా జమ చేస్తామని ఉమ్మడిజిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జగనన్న తోడు ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ అభివృద్ధి సలహాదారుడు హబీబుల్లా, డీఆర్డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి లబ్ధిదారులు పాల్గొన్నారు. జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎవరైనా అర్హత ఉండి కూడా పథకం అందకపోతే వారికి కూడా లబ్ధి చేకూరుస్తామని పేర్కొన్నారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కును అందజేశారు.

మద్యం మత్తులో డ్రైవింగ్ : డ్రైవర్‌కు గాయాలు

నంద్యాల క్రైం, జనవరి 11 : మద్యం మత్తులో కారు నడుపుతూ డివైడర్‌ను ఢీకొనడంతో డ్రైవర్‌కు గాయాలైన ఘటన నంద్యాల పట్టణంలో గురువారం తెల్లవారుజామున జరిగింది. ట్రాఫిక్ ఎస్ఐ నజీర్‌బాష తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల పట్టణంలోని రాజ్‌టాకీస్ సమీపంలో గురువారం తెల్లవారు జామున మద్యం తాగి డ్రైవర్ కారును అజాగ్రత్తగా నడపడంతో డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. నైట్ బీట్ కానిస్టేబుళ్లు ప్రమాదానికి కారణమైన కారును గుర్తించి గాయపడిన డ్రైవర్‌ను వెంటనే నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ నజీర్‌బాష తెలిపారు.

'వడ్డె ఓబన్న విగ్రహం ఏర్పాటు చేయాలి'

నంద్యాల రూరల్, జనవరి 11 : రాష్ట్ర ప్రభుత్వం వడ్డె ఓబన్న విగ్రహాన్ని నంద్యాలలో ఏర్పాటు చేయాలని ఆ సంఘం వడ్డె ఓబన్న సేవా సమితి శ్రీశైలం నియోజకవర్గ అధ్యక్షుడు చల్లా వెంకటేష్ డిమాండ్ చేశారు. నంద్యాల వడ్డెర సంఘం కార్యాలయంలో గురువారం ఓబన్న జయంతి జరిగింది. కార్య క్రమంలో చల్లా వెంకటేష్ మాట్లాడుతూ వడ్డె ఓబన్న బ్రిటీష్ వారితో పోరాడాడన్నారు. ఓబన్న విగ్రహం ఏర్పాటు కోసం ప్రభుత్వం ఐదు సెంట్ల స్థలాన్ని కేటాయించటంతోపాటు విగ్రహం ఏర్పాటు చేయాని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంపంగి శివ భాస్కర్, సంపంగి రామకృష్ణ, ఛత్రపతి, వల్లపు రాము, దుర్వేశి జమ్ములు, మహానంది పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేయాలి

ఆత్మకూరు, జనవరి 11: లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేయాలని ఆత్మకూరు తహసీల్దార్ ఉమారాణి అన్నారు. గురువారం పట్టణంలోని 5, 12 వార్డుల్లో మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్‌ల ద్వారా జరుగుతున్న రేషన్ పంపిణీ ప్రక్రియను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా..? అని తెలుసుకున్నారు. సమస్యను తహసీల్దార్ ఉమారాణి దృష్టికి తీసుకురావడంతో లబ్ధిదారుల సౌకర్యార్థం వీలైనంతవరకు సాయంత్రం వేళల్లో రేషన్ పంపిణీ చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఈమె వెంట వీఆర్వోలు ఉన్నారు.

నేటి నుంచి శ్రీశైలంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు



విద్యుత్ దీపకాంతుల్లో ఆలయం

శ్రీశైలం, జనవరి 11 : శ్రీశైల మహాక్షేత్రంలో మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఉదయం యాగశాల ప్రవేశంతో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. పంచాహ్నిక దీక్షతో ఏడు రోజులపాటు నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలు ఈ నెల 18న ముగియనున్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని, ప్రధాన వీధులను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. అలాగే బ్రహ్మోత్సవాలకు భక్తులకు స్వాగతం పలుకుతూ శ్రీశైలం ముఖద్వారం నుంచి శ్రీశైలం వరకు రహదారి మార్గంలో స్వాగతతోరణాలు ఏర్పాటు చేశారు. 12 వ తేదీ శుక్రవారం ఉదయం 8.30 గంటలకు స్వామివారి యాగశాల ప్రవేశంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. బ్రహ్మోత్సవాలలో రెండవ రోజు నుంచి స్వామి, అమ్మవార్లకు వాహన సేవలు నిర్వహిస్తారు. 13వ తేదీన భృంగివాహనసేవ, 14న రావణవాహనసేవ, 15వ తేదీ మకరసంక్రాంతి పర్వదినం రోజున నందివాహనసేవ, స్వామి, అమ్మవార్లకు బ్రహ్మోత్సవ కల్యాణం, 16వ తేదీన కైలాసవాహనసేవ, 17 వతేదీన యాగపూర్ణాహుతి, కలశోద్వాసన, త్రిశూలస్నానం, సదస్యం, నాగవల్లి, ధ్వజావరోహణ కార్యక్రమాలు, 18 వ తేదీన రాత్రి జరిగే పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవలతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాల సందర్భంగా ఈ నెల 12 నుంచి 18 వరకు ఆర్జిత, ప్రత్యక్ష, పరోక్షసేవలైన రుద్రహోమం, చండీహోమం, మృత్యుంజయహోమం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం, స్వామి, అమ్మవార్ల కల్యాణం, ఏకాంతసేవలను నిలుపుదల చేశారు.

రెండు రైళ్ల పొడిగింపు



నంద్యాల (నూనెపల్లె), జనవరి 11: దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల గమ్య స్థానాలను పొడిగించిన క్రమంలో నంద్యాల మీదుగా రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లను పొడిగించినట్లు రైల్వే అధికార వర్గాలు గురువారం తెలిపారు. అమరావతి, కడప డెమో రైళ్లను పొడిగించినట్లు చెప్పారు. 17225/17226 హుబ్లీ - విజయవాడ అమరావతి ఎక్స్‌ప్రెస్‌ను నర్సాపూర్ వరకు పొడిగిస్తూ ఆ రైలును 12వ తేదీన నర్సాపూర్‌లో, 07284/07285 నంద్యాల - కడప డెమో రైల్‌ను రేణుగుంట వరకు పొడిగిస్తూ ఆ రైలును 13వ తేదీన రేణిగుంటలో రైల్వే ఉన్నతాధికారులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. 17225 నర్సాపూర్ - హుబ్లీ రైలు నర్సాపూర్‌లో సాయంత్రం 4.10 గంటలకు బయలు దేరి పాలకొల్లు, భీమవరం, ఆకివీడు, కైకలూరు, గుడివాడల మీదుగా విజయవాడకు 7.40కి చేరుకొని, 7.55కు విజయవాడ నుంచి బయలు దేరి గుంటూరు, నర్సరావుపేట, వినుకొండ, మార్కాపురం, కంబం, గిద్దలూరు మీదుగా తెల్లవారు జామున 2.20 గంటలకు నంద్యాలకు చేరుకుంటుందని అన్నారు. 17226 హుబ్లీ - నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు హుబ్లీలో మధ్యాహ్నం 1.20 గంటలకు బయలుదేరి నంద్యాలకు రాత్రి 9.10కి చేరుకొని తెల్లవారు జామున 3.40కి విజయవాడకు చేరుకుంటుందని, అక్కడి నుంచి కేటాయించిన మార్గంలో ఉదయం 7.40 గంటలకు నర్సాపూర్‌కు చేరుకుంటుందని పేర్కొన్నారు. 07284 రేణుగుంట - నంద్యాల వరకు డెమో రైలు రేణుగుంటలో 13వతేదీ మధ్యాహ్నం 1.45 గంటలకు బయలుదేరి సూచించిన మార్గంలో నంద్యాలకు రాత్రి 8 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. అలాగే 07285 నంద్యాల - రేణుగుంట డెమో రైలు నంద్యాలలో ఉదయం 5.40 గంటలకు బయలుదేరి బనగానపల్లె, కోవెలకుంట్ల, సంజామల, నొస్సం, ఉప్పలవాడు, జమ్ములమడుగు, ప్రొద్దుటూరు, యర్రగుంట్ల, కమలాపురం, కడపకు ఉదయం 9.30 గంటలకు చేరుకుంటుంది. అక్కడి నుంచి ఒంటిమిట్ట, నందలూరు, రాజంపేట, కోడూరు, బాలేపల్లె మీదుగా రేణుగుంటకు మధ్యాహ్నం 12.40 గంటలకు చేరుకుంటుందని అధికారులు తెలిపారు.

శిల్పా .. నీచ రాజకీయాలు మానుకో

- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఫరూక్ హెచ్చరిక
- రాజకీయ లబ్ధి కోసం నంద్యాల ప్రజలను బలిచేయొద్దు
- మత కలహాలు సృష్టించేందుకే ఫ్లెక్సీల పన్నాగం



మాట్లాడుతున్న ఫరూక్

నంద్యాల (నూనెపల్లె), జనవరి 11: శాంతికి, మతసామరస్యానికి రాష్ట్ర చరిత్రలోనే నిలిచిన నంద్యాలలో మత విద్వేషాలకు తావులేదని, నీచ రాజకీయాలు మానుకోవాలని స్థానిక ఎమ్మెల్యే శిల్పా రవిని ఉద్దేశించి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, నంద్యాల అసెంబ్లీ ఇన్‌చార్జి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. గురువారం నంద్యాలలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రజల అశాంతిని రగిలించాలనే దురుద్దేశంతో బయట నుంచి వచ్చిన వలస వాదులు శిల్పా మోహన్‌రెడ్డి, తన కొడుకు శిల్పా రవి తమ రాజకీయ లబ్ధి కోసం నంద్యాల ప్రజలను బలి చేయాలని చూస్తున్నారని, వారి ఉచ్చులో ప్రజలు పడకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో కావాలని కుట్రపూరితంగా మత కలహాలు సృష్టించే విధంగా వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యేలు పన్నాగం పన్ని బుధవారం అర్ధరాత్రి పట్టణంలోని ప్రధాన కూడళ్లలో వివాదాస్పదంగా పెద్దఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ ఫ్లెక్సీలు ఎక్కడి నుంచి వచ్చాయని, ఎవరి ఆదేశాల మేరకు ఎవరు ఈ పనులు చేస్తున్నారో పోలీసు అధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని, లేదంటే ఆందోళనకు సిద్ధమని ఆయన హెచ్చరించారు.

మహిమాన్వితుడు తాండవ మల్లేశ్వరుడు

- నేటి నుంచి తిరునాళ్ల ఉత్సవాలు ప్రారంభం



తాండవమల్లేశ్వరస్వామి ఆలయం

కొత్తపల్లి, జనవరి 11: కొత్తపల్లిలోని తాండవమల్లేశ్వరస్వామి ఆలయానికి వందల ఏళ్ల క్రితం చరిత్ర ఉంది. చోళభూపాల మహారాజు కాలంలో కోట బుర్జులు నిర్మించే ముందు దైవానుగ్రహం కోసం దేవాలయ నిర్మాణం ఆనవాయితీగా కొనసాగేది. ఈ నేపథ్యంలో చోళ భూపాలుడు కొత్తపల్లిలో తాండవ మల్లేశ్వరస్వామి ప్రతిష్ట, గర్భగుడి నిర్మాణం చేపట్టినట్లు తెలుస్తోంది. కోట శిథిలమైపోగా ప్రస్తుతం కోటగడ్డగా స్థానికులు పిలుస్తున్నారు.

14నుంచి ఉత్సవాలు : తాండవమల్లేశ్వరస్వామి ఉత్సవాలు ఈ నెల 14 నుంచి ప్రారంభమవుతున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణ అధికారి కార్తీక్ గురువారం తెలిపారు. 14న స్వామివారి కల్యాణ మహోత్సవాలు ప్రారంభమై 17న ముగుస్తాయన్నారు. 16న ఉదయం స్వామివారికి అభిషేకం, సభాపూజ, సాయంత్రం 5గంటలకు అన్నదానం, రాత్రి చెక్కభజన, స్వామివారి ప్రభోత్సవం ఉంటుందని చెప్పారు. 17న ఉదయం అభిషేకం, సాయంత్రం 4గంటలకు పారువేట ఉంటుందని పేర్కొన్నారు.

డంపింగ్ యార్డు వద్దంటూ ఆందోళన



డంపింగ్ యార్డు వద్దంటూ కాలనీవాసుల ఆందోళన

ఆత్మకూరు, జనవరి 11: పట్టణ శివారులోని వడ్లరామాపురం రస్తాలో డంపింగ్ యార్డు వద్దంటూ సమీప కాలనీలు ఎస్సీజీ పాలెం, ఎబీఎంపాలెం వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. పారిశుధ్యకార్మికులు 16 రోజులుగా సమ్మెలో ఉండడంతో పట్టణంలో ఎక్కడబడితే అక్కడ చెత్త పేరుకుపోయి వాటిని కంప్యాక్టర్ల ద్వారా పట్టణ శివారు వడ్లరామాపురం రస్తా పక్కనే ఉన్న డంపింగ్ యార్డుకు తరలించే ప్రయత్నం చేశారు. కాలనీల పక్కనే డంపింగ్ యార్డు ఏర్పాటు చేసి చెత్తనిల్వలకు నిప్పంటిస్తుండడంతో పొగ, దుర్వాసనతో రోగాలు ప్రబలుతున్నాయని ఎస్సీజీ, ఎబీఎం పాలెం కాలనీలకు చెందిన ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. చెత్త డంపింగ్ చేస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. దీంతో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఎస్ఐ వెంకటనారాయణ అక్కడికి చేరుకుని వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ కాలనీవాసులు డంపింగ్ యార్డు నిర్వహణకు అంగీకరించ లేదు.

మాగోడు పట్టదా?

అంగన్‌వాడీల ఆవేదన



నంద్యాలలో నిరవధిక దీక్షలో పాల్గొన్న అంగన్‌వాడీ వర్కర్లు



ఆత్మకూరులో సర్వమత ప్రార్థనలు చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

నంద్యాల (నూనెపల్లె), జనవరి 11: సమస్యల పరిష్కారానికై నెల రోజుల నుంచి పోరాడుతున్నా మా గోడు సీఎంకు పట్టదా అని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మల ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా గురువారం నంద్యాలలోని దీక్షా శిబిరంలో అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తోట మద్దులు, యూనియన్ నాయకురాలు నిర్మల మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు, సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి అంగన్‌వాడీ వర్కర్ల సమస్యను పక్కన పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

షోకాజ్ నోటీసులు తిరస్కరణ

మహానంది : న్యాయపరమైన డిమాండ్ల కోసం పోరాటం చేస్తుంటే ప్రభుత్వం ఎస్మా చట్టంతో పాటు తాజాగా పంపిన షోకాజ్ నోటీసులను అంగన్వాడీ వర్కర్లు తిరస్కరించారు. గురువారం 31వ రోజు మహానందిలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అక్కడికి ప్రభుత్వం పోస్టు ద్వారా పంపించిన షోకాజ్ నోటీసులను అంగన్వాడీలు తిరస్కరించారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు దీక్షను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. నాయకులు నారాయణమ్మ, సావిత్రి, పుష్పకళ, ప్రసన్న, చండీదేవి, కళావతి పాల్గొన్నారు.

సర్వమత ప్రార్థనలు

ఆత్మకూరు: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేపడుతున్న నిరవధిక నిరాహార దీక్షలు గురువారం నాటికి 31వ రోజుకు చేరాయి. తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలోని దీక్షా శిబిరం వద్ద అంగన్‌వాడీలు ఓం, అల్లా, సిలువ ఆకారాల్లో కూర్చొని సర్వమత ప్రార్థనలు చేస్తూ నిరసన తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు మంజుల, లక్ష్మీదేవీ, వెంకటలక్ష్మీ, సీఐటీయూ నాయకులు రామ్‌నాయక్, రణధీర్ మాట్లాడుతూ తమ డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీ వర్కర్లు ఇన్ని రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ సీఎం జగన్ స్పందించకపోవడం సరికాదని అన్నారు. అంగన్‌వాడీల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించుకునేవరకు పోరాటం వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకురాలు సుధారాణి, వెంకటలక్ష్మీ, లక్ష్మీ, ప్రియాంక, ప్రమీళ, రవణమ్మ, అరుణ, విజయలక్ష్మీ, సుజాత తదితరులు ఉన్నారు.

పోలీసుల ఆకస్మిక తనిఖీ

- జిల్లా వ్యాప్తంగా ప్రతి వాహనం పరిశీలన



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

నంద్యాల క్రైం, జనవరి 11 : నంద్యాల జిల్లా వ్యాప్తంగా పోలీసులు ఆకస్మికంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సార్వత్రిక, ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి ఆదేశాల మేరకు ముందస్తు చర్యల్లో భాగంగా గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. జిల్లాలోని అన్ని పోలీస్ సబ్ డివిజన్ కేంద్రాల పరిధిలో ఈ కార్యక్రమం కొనసాగింది. ప్రధాన కూడళ్లలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే వదిలి పెట్టారు. ఎలాంటి అసాంఘిక ఘటనలకు ఆస్కారం లేకుండా రాత్రి గస్తీ చేపట్టారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిర్మూలన కోసం తనిఖీలు నిర్వహిస్తున్నారు. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా ఆయా పోలీస్‌స్టేషన్ల వారీగా చేపట్టిన వాహనాల తనిఖీ కార్యక్రమాలు ఆయా డీఎస్పీల ఆధ్వర్యంలో సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ నైట్ డ్యూటీలో పాల్గొనే పోలీస్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రాత్రివేళల్లో అనవసరంగా తిరిగేవారిపై దృష్టి సారించాలని, బీట్లలో ఉన్న సిబ్బంది వారి స్టేషన్ పరిధిలో నేరచరిత్ర కలిగిన వారిపై, అనుమానితులపై నిఘా వేయాలని, నైట్ బీట్ సిబ్బంది ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా లాఠీలు కలిగి ఉండాలని తెలిపారు. అనుమానితుల వేలిముద్రలు తీసుకోవాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణే నంద్యాల జిల్లా పోలీసుల ధ్యేయమని ప్రజల్లో నమ్మకం కలిగించేలా ప్రతి పోలీస్ విధి నిర్వహణ చెయ్యాలని పేర్కొన్నారు. ముఖ్యంగా రాత్రిళ్ల దొంగతనాలు, అల్లర్లు, గొడవలు జరగకుండా చూడటంతోపాటు కారణం లేకుండా రాత్రివేళల్లో తిరిగే ఆకతాయిలపై, మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై చర్యలు చేపట్టాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులను విచారణ చేయాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, పోలీస్ అధికారులు ఆయా స్టేషన్ల పరిధిలోని నేర చరిత్ర గల వ్యక్తులు, అనుమానితుల వివరాలు, వారి అడ్రస్, ఫోన్ నెంబర్లతో సహా బీట్ బుక్కులలో నమోదు చేయాలని ఆదేశించారు.

జగన్ పాలన అంతంగాక తప్పదు

- ఆళ్లగడ్డ సభతో వైసీపీలో వణుకు మొదలైంది
- శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



బుడ్డా రాజశేఖరరెడ్డి

ఆత్మకూరు, జనవరి 11: చంద్రబాబు ద్వారానే రాష్ట్రానికి స్వర్ణయుగం రాబోతుందని, రానున్న ఎన్నికల్లో భస్మాసురుడు జగన్ పాలన అంతంగాక తప్పదని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియంత జగన్ విధానాలు నచ్చక సొంత పార్టీ ఎమ్మెల్యేలే తిరుగుబాటు చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను గాలికి వదిలేసి అరాచకాలు, దౌర్జనాలు, దోపిడీలతో పాలన సాగించారని మండిపడ్డారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి సృష్టించబోయే సంచలనాలకు వైసీపీ గల్లంతు కావడం ఖాయమని స్పష్టం చేశారు. ఆళ్లగడ్డలో ఇటీవల జరిగిన రా.. కదలిరా.. చంద్రబాబు సభతో వైసీపీలో వణుకు మొదలైందన్నారు. ఇదే స్ఫూర్తితో ఉమ్మడి జిల్లాలో అన్ని సీట్లలో టీడీపీ విజయం సాధించడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్ ఉంటుందన్న నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

నాటు సారా స్థావరాలపై దాడులు

నంద్యాల క్రైం, జనవరి 11 : జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం సెబ్ అధికారులు నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. అవుకు మండలంలోని పిక్కలిపల్లి తండా ఊరి బయట నాటుసారా స్థావరంపై సెబ్ అధికారి దౌలత్‌ఖాన్ ఆధ్వర్యంలో దాడి చేశారు. ఈ దాడిలో పది లీటర్ల నాటుసారాతోపాటు సుమారు 500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అలాగే గడివేముల మండలం ఒండుట్ల గ్రామ శివారులో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారి నాగమణి ఆధ్వర్యంలో నాటుసారా స్థావరంపై దాడి చేశారు. నాటుసారా బట్టీ నిర్వాహకుడు ఎస్.దాసునాయక్ పరారయ్యాడని, త్వరలో అతడిని అరెస్ట్ చేస్తామని నాగమణి తెలిపారు.

నెలాఖరులోపు రీసర్వే పూర్తి చేస్తాం : జేసీ



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జేసీ, డీఆర్వో

నంద్యాల (కల్చరల్), జనవరి 11: జగనన్న భూహక్కు-భూరక్ష పథకం కింద మూడవ విడతో చేపట్టిన రీసర్వే పనుల ప్రక్రియ ఈ నెలాఖరులోపు పూర్తి చేస్తామని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి నివేదించారు. గురువారం విజయవాడ ఏపీ సెక్రటేరియట్‌లోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి ఎన్నికల సన్నద్ధత, ఆరోగ్యం, వైద్యం తదితర అంశాలపై కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ మూడవ విడతలో 150 గ్రామాలలో చేపట్టిన రీసర్వే పనుల ప్రక్రియకు సంబంధించి 102 గ్రామాలలో పూర్తయిందని, మిగిలిన 48 గ్రామాలలో ఈ నెలాఖరులోపు పూర్తి చేస్తామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి నివేదించారు. స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ కూడా వేగవంతంగా జరుగుతోందన్నారు. ఇనాం భూములు, అసైన్డ్ భూములకు సంబంధించి వీఆర్వో, తహసీల్దార్, ఆర్డీఓ లాగిన్‌లో ఉన్న వాటిని పూర్తి స్థాయి విచారణ జరిపి త్వరితగతిన క్లియర్ చేస్తామని జేసీ వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

నంద్యాల రూరల్, జనవరి 11 : నంద్యాల మండల ప్రజా పరిషత్ సమావేశ భవనంలో శుక్రవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల ప్రజా పరిషత్తు అధ్యక్షుడు శెట్టి ప్రభాకర్ ఆధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీ, కో-ఆప్టెడ్ సభ్యులు, సర్పంచులు అన్ని శాఖల మండల స్థాయి అధికారులు హాజరు కావాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రకటనలో కోరారు. గైర్హాజరైన అధికారుల వివరాలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

అయోధ్య శ్రీరాముడి అక్షింతలు పంపిణీ

ఆత్మకూరు, జనవరి 11: శ్రీరామ జన్మస్థలమైన అయోధ్యలో ఈనెల 22వ తేదిన బాలరాముడి భవ్య మందిరంలో స్వామివారి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకుని అయోధ్య నుంచి ప్రత్యేకంగా పంపించబడిన పవిత్ర అక్షింతలను భారతీయ జనతా పార్టీ మైనార్టీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు మోమిన్‌షబానకు ఆదివారం విశ్వహిందూ పరిషత్ నాయకులు పంపిణీ చేశారు. స్థానిక ఆమె కార్యాలయానికి వారు వెళ్లి అయోధ్య రాముడి అక్షింతలతో పాటు అయోధ్య రామమందిర చిత్రపటాన్ని, ఆహ్వాన కరపత్రాన్ని అందజేశారు. స్థానిక విశ్వహిందూ పరిషత్ నాయకులు పాల్గొన్నారు.

పీఎఫ్ నగదు జమకు మార్గం సుగమం

నంద్యాల (నూనెపల్లె), జనవరి 11: జిల్లాలోని పంచాయతీ రాజ్ ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందికి ప్రావిడెంట్ ఫండ్ నగదు జమకు మార్గం సుగమం అయిందని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నగిరి శ్రీనివాసులు అన్నారు. గురువారం నంద్యాలలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 2002 సెప్టెంబరు నుంచి జీతాలలో పీఎఫ్ కటింగ్ జరిగినప్పటికీ జడ్పీ పీఎఫ్ ఖాతాలలో మాత్రం జమ కావడం లేదని, ఈ సమస్యపై ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు గత ఏడాది డిసెంబరు 12న డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ, అకౌంట్స్ డైరెక్టర్ మోహన్‌రావుకు, సీఎఫ్ఎంఎస్ రాష్ట్ర ఉన్నతాధికారును కలిసి సమస్య పరిష్కారంపై కోరినట్లు పేర్కొన్నారు.

అతివేగం... అరచేతిలో ప్రాణం

- దూసుకొస్తున్న భారీ వాహనాలు
- ఇరుకు దారిలో రాకపోకలు
- పట్టించుకోని అధికారులు



మలుపు వద్ద వెళ్లలేకపోతున్న భారీ వాహనం

గడివేముల, జనవరి 11: ఇరుకు దారులు.. అతివేగం వెరసి భారీ వాహనాలు అదుపుతప్పి మృత్యు శకటాలుగా మారుతున్నాయి. దారి వెంట ప్రయాణించే వారిపై దూసుకెళ్తున్నాయి. మలుపుల వద్ద తిరగలేక రహదారిపై నిలిచిపోతూ గంటల కొద్ది ట్రాఫిక్ జామ్‌కు కారణమవుతున్నాయి. భారీ వాహనాలను అదుపుచేసి సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మండల కేంద్రంలోని రహదారి ఇరుకుగా ఉండి మలుపులు తిరిగి ఉంటుంది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తమ అవసరాల నిమిత్తం గడివేములకు రాకపోకలు సాగి స్తుండటంతో ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. ఒక వాహనానికి మరోక వాహనం ఎదురుగా వస్తే వెళ్లలేని పరిస్థితి ఉంది. ఇలాంటి రహదారిపై భారీ వాహనాలు హారన్ మోగిస్తూ అతివేగంగా దూసుకొస్తుండటంతో ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు.

● గడివేముల మీదుగా రాకపోకలు

మండలంలోని సిమెంట్ పరిశ్రమకు ముడి సరుకును తీసుకొని రావడానికి పరిశ్రమ ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. పరిశ్రమ యాజమాన్యం వాహనాల రాకపోకల కోసం పరిశ్రమ నుంచి నంద్యాల సమీపంలోని ప్రధాన రహదారి వరకు రహదారిని నిర్మించింది. సరుకు రవాణా ఈ రహదారి గుండానే చేయాలని వాహన యజమానులకు షరతులు విధించి అందుకు అనుగుణంగా రవాణా చార్జీలు చెల్లిస్తుంది. పరిశ్రమ నుంచి బళ్లారి, హైదరాబాదుకు అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వాహన యజమానులు ఇంధన భారం, టోల్ రుసుము తగ్గించుకునేందుకు పరిశ్రమ సూచించిన మార్గంలో కాకుండా గడివేముల మీదుగా పరిశ్రమకు రాకపోకలు సాగిస్తున్నారు. ఇరుకైన రహదారిలో భారీ వాహనాలు వస్తుండటంతో తరచూ ప్రమాదాలు సంబవిస్తున్నాయి. గతంలో ఈ వాహనాల కింద ముగ్గురు మృత్యువాత పడ్డారు. మరోకరు మృతి చెందారు.

● పట్టించుకోని అధికారులు

గడివేముల మీదుగా భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని పలుమార్లు ప్రజలు అధికారులకు వినతి పత్రాలను అందజేశారు. గడివేముల పాతబస్టాండులో ధర్నాలు చేశారు. అయిన అధికారులు వాహనాల రాకపోకలను నియంత్రించడంలో విఫలమయ్యారు. గడివేములకు బైపాస్ రోడ్డును నిర్మించాలని పలు సంఘాలు డిమాండ్ చేసినా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు.

చర్యలు తీసుకుంటాం



ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. భారీ వాహనాలను నిర్ణీత సమయంలో రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకుంటాం. అతివేగంగా వాహనాలను నడిపే వాహనచోదకులపై చర్యలు తీసుకుంటున్నాం.

- బీటీ వెంకటసుబ్బయ్య, సీఐ గడివేముల

నోటీసులతో సమ్మెను ఆపలేరు

● 31వ రోజు సమ్మెలో అంగన్‌వాడీల ఆగ్రహం ● డిమాండ్లు నెరవేర్చే దాకా ఆందోళన ఆగదని స్పష్టం ● వినూత్న రీతుల్లో ఆందోళనలు ● వివిధ సంఘాల మద్దతు


చాగలమర్రిలో చీపుర్లతో రహదారులు శుభ్రం చేస్తూ నిరసన


బనగానపల్లె ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు


ఉయ్యాలవాడ మోకాళ్లపై నిరసన


సంజామలలో 31 సంఖ్య ఆకారంలో కూర్చున్న అంగన్‌వాడీలు

నోటీసులతో సమ్మెను ఆపలేరని అంగన్‌వాడీలు అన్నారు. వారు చేపట్టిన సమ్మె గురువారం 31వ రోజుకు చేరుకుంది. వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేశారు. డిమాండ్లు నెరవేర్చే దాకా సమ్మె ఆగదని స్పష్టం చేశారు.

ఆళ్లగడ్డ, జనవరి 11: ఆళ్లగడ్డలో గురువారం సమ్మె కొనసాగింది. నోటీసులను తీసుకోమని అంగన్‌వాడీలు చెప్పారు.

రుద్రవరం: రుద్రవరంలోని తహసీల్దారు కార్యాలయం ఎదురుగా గురువారం నిర్వహించిన సమ్మె 31వ రోజుకు చేరుకుంది. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

చాగలమర్రి: చాగలమర్రిలోని అంబేడ్కర్ కార్యాలయం వద్ద 24 గంటల నిరాహార దీక్షను గురువారం విరమింప చేశారు. అనంతరం చీపుర్లు చేతపట్టి రహదారులు శుభ్రం చేస్తూ నిరసన ప్రకటించారు. 31 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. సమస్య పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని అన్నారు.

ఉయ్యాలవాడ: ప్రభుత్వం నోటీసులు ఇచ్చి బెదిరింపులకు గురి చేసినా తమ డిమాండ్‌లు నెరవేర్చేంత వరకు తమ సమ్మె విరమించేది లేదని మండల అంగన్‌వాడీ యూనియర్ నాయకులు అన్నారు. గురువారం తహసీల్దారు కార్యాలయం వద్ద 31వ రోజు మోకాళ్లపై నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని జిల్లా యూనియన్ నాయకుల డిమాండ్ చేశారు. గురువారం దొర్నిపాడు తహసీల్దార్ కార్యాలయంలో 31వ

పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలుచేపట్టిన సమ్మె 31వ రోజుకు చేరుకుంది. 31 అంకె వచ్చేలా కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో శడివరామయ్యకు వినతిపత్రం సమర్పించారు. సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

● సంజామలలోని సహకార బ్యాంక్ ఆవరణలో గురువారం అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 31 రోజులకు చేరింది. 31 అంకె వచ్చే విధంగా కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. న్యాయమైన డిమాండ్లను అంగీకరించకపోగా సమ్మెను నీరుకారుస్తూ ఎస్మా చట్టాన్ని ప్రయోగించారన్నారు. ఎస్మాకు భయపడబోమన్నారు. కార్యక్రమంలో , అంగన్‌వాడీ ఆయాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆళ్లగడ్డలో..


రుద్రవరంలో..


దొర్నిపాడులో..

'బీసీల నడ్డి విరుస్తున్న వైసీపీ'


సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావుయాదవ్, నాయకులు

డోన్, జనవరి 11: వైసీపీ ప్రభుత్వం బీసీల నడ్డి విరుస్తోందని టీడీపీ బీసీ రాష్ట్ర సాధికార సమితి కన్వీనర్ వై.నాగేశ్వరరావుయాదవ్ విమర్శించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో బీసీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. వైసీపీ ప్రభుత్వం బీసీలను రాజకీయంగా అనగదొక్కుతోందని ఆరోపించారు. అలాగే బీసీల సంక్షేమం కోసం చంద్రబాబు అమలు పరిచిన అన్ని సంక్షేమ పథకాలను రద్దు చేయడం బాధాకరమన్నారు. బీసీల ద్రోహిగా మారిన సీఎం జగన్‌కు గుణపాఠం చెప్పాలని నాగేశ్వరరావు యాదవ్ పిలుపునిచ్చారు. అనంతరం స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని పురస్కరించుకొని నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, నాయకులు ప్రజావైద్యశాల మల్లికార్జున, శ్రీనివాసులు యాదవ్, అబ్బిరెడ్డిపల్లి గోవిందు, ఎర్రమల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిగ్రస్థుల గుర్తింపు సర్వే పరిశీలన

చాగలమర్రి, జనవరి 11: చాగలమర్రిలో జాతీయ కుష్ఠు వ్యాధి నివారణ ఉత్సవాల్లో భాగంగా గురువారం వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న సర్వేను వైద్యశాఖ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి పరిశీలించారు. కోటగడ్డ వీధిలో జరుగుతున్న ఇంటింటి సర్వేను పరిశీలించి అనుమానిత లక్షణాలు ఉన్నవారిని గుర్తించారు. ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో నెల రోజుల నుంచి వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు కుష్ఠు వ్యాధిగ్రస్థుల గుర్తింపు సర్వే చేస్తున్నారని అన్నారు. ఇప్పటి వరకు 149 అనుమానిత కేసులు గుర్తించామని తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయిన వారిని గుర్తించి ప్రభుత్వం ద్వార ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఏఎన్ఎం మాధవి, ఆశా వర్కర్ శివలక్ష్మి ఉన్నారు.

'నకిలీ పురుగు మందులు విక్రయిస్తే చర్యలు'

చాగలమర్రి, జనవరి 11: పురుగు మందుల దుకాణాల్లో నకిలీ మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో రంగనేతాజీ హెచ్చరించారు. గురువారం చాగలమర్రి గ్రామంలోని లక్ష్మీ వెంకటేశ్వర పురుగులు, ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కాలం చెల్లిన మందులు విక్రయించకూడదన్నారు. ఎరువుల స్టాక్ బోర్డును ఉంచాలని, నిర్ణీత ధరలకు విక్రయించాలని అన్నారు. రైతులకు తప్పకుండా బిల్లులు అందించాలని అన్నారు. అనుమతి లేని మందులు విక్రయించరాదని అన్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని అన్నారు. పురుగులు, ఎరువుల శాంపిళ్లను సేకరించారు. ఆయన వెంట ఏఈవోలు ఉన్నారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'


మాట్లాడుతున్న అన్సర్‌బాషా

చాగలమర్రి, జనవరి 11: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా అన్నారు. గురువారం చాగలమర్రి టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆళ్లగడ్డలో జరిగిన రా.. కదలిరా నినాదంతో చేపట్టిన సభతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల్లో జోష్ నింపిందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ఇదే ఉత్సాహంతో టీడీపీ జెండా ఎగరవేసేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. వైసీపీ అరాచక పాలనకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. టీడీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొలిమి షరీఫ్, మౌలాలి, అనీఫ్, అక్బర్, సుబ్బారావు, ముల్లా శ్యాబుల్, అజీమ్, అబ్దుల్‌ఖాదర్, జెట్టి నాగరాజు, గఫార్, బషీర్, నూర్‌బాషా, ఉసేన్‌వలి, లడ్డుబాషా పాల్గొన్నారు.

'ప్రతి గడపలో రామనామ స్మరణ జరగాలి'

శిరివెళ్ల, జనవరి 11: ఈ నెల 22న అయోధ్యలో రామమందిరం ప్రారంభమవుతుండడంతో ఆ రోజు ప్రతి గడపలో రామనామ స్మరణ జరగాలని, ప్రతి గ్రామంలోని రామాలయంలో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించాలని విశ్వహిందూ పరిషత్ శిరివెళ్ల ప్రఖండ ఇన్‌చార్జి వైవీ రామయ్య పిలుపునిచ్చారు. మండలంలోని గోవిందపల్లెలోని గోవిందా నంద ఆశ్రమంలో గురువారం సమావేశం నిర్వహించారు. హిందు ధర్మాన్ని నలుదిశలా చాటాలన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు నడిపి సుబ్బారెడ్డి, చంద్ర, నాగమల్లేశ్వరరెడ్డి, జనార్దన్‌రెడ్డి, రామాంజనేయులు, నాగమణి, కంబయ్య పాల్గొన్నారు.

'మద్దతు ధరతో జొన్న కొనుగోలు'

ఉయ్యాలవాడ, జనవరి 11: ప్రభుత్వ మద్దతు ధరతో జొన్నల కొనుగోలు ప్రారంభిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రాజేంద్ర కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ హైబ్రిడ్ రకాలను క్వింటా రూ. 3,100కు, మల్‌దండి రకాలను క్వింటా రూ.3,225తో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. సివిల్ సప్లయ్ ద్వారా ఎఫ్ఏక్యూ నాణ్యత ప్రమాణాలను బట్టి రైతుల వద్దకే వచ్చి కొనుగోలు చేస్తారని తెలిపారు. ప్రభుత్వ ధరకు విక్రయించాలనుకుంటే రైతులు స్థానిక రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రభుత్వం ఏడు వేల క్వింటాల జొన్నలు కొనుగోలుకు ఆమోదం తెలిపిందన్నారు. జొన్నలు కొన్న వెంటనే ఉన్నాతాధి కారులు రైతులు వ్యక్తిగత ఖాతాల్లో డబ్బు జమ చేస్తారని ఆయన చెప్పారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రుద్రవరం, జనవరి 11: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ బాలస్వామి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

16 నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

రుద్రవరం, జనవరి 11: మండలంలోని ఆలమూరు గ్రామంలో ఈ నెల 16, 17 తేదీల్లో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గురువారం హమాలీ యూనియన్ సభ్యులు తెలిపారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకుని, గ్రామంలో చెన్నకేశవస్వామి రథోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి నాలుగు బహుమతులు వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5వేలు అందించనున్నట్లు తెలిపారు. రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 6300809814, 6305553123 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

'ప్రతి ఇంటికి తాగునీరు'


హరినగరం చెంచుగూడెంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

రుద్రవరం, జనవరి 11: చెంచుగూడేల్లో ప్రతి ఇంటికి తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నట్లు ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని హరినగరం చెంచుగూడెంలో గురువారం జన్‌మన్ ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహాఅభియాన్‌పై గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ చెంచుగూడెల్లో కనీస సౌకర్యాల గురించి చెంచులను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ కమలమ్మ, ఏపీవో ప్రతాప్, కార్యదర్శులు ఆదిలక్ష్మి, శివకృష్ణ, వీఆర్వో ఓబులేసు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

'రైతులను దగా చేసిన వైసీపీ'


కోవెలకుంట్ల: లింగాలలో ప్రచారం చేస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి


బనగానపల్లెలో ప్రచారం చేస్తున్న బీసీ ఇందిరమ్మ

కోవెలకుంట్ల, జనవరి 11: రైతులను వైసీపీ ప్రభుత్వం దగా చేసిందని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. గురువారం కోవెలకుంట్ల మండలంలోని లింగాల గ్రామంలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో గురించి వివరించారు. బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ కుందూనదిపై జోలదరాసి రిజర్వాయర్ నిర్మాణం టీడీపీతోనే సాధ్యమని అన్నారు. కుందూనది రిజర్వాయర్ శంకుస్థాపన చేసిన 16 నెలల్లో పూర్తి చేస్తామని ప్రగల్భాలు పలికిన వైసీపీ నాయకులు ఒక ఇటుక కూడా పేర్చలేదని విమర్శించారు. లింగాల గ్రామంలో 2014నుంచి 2019 వరకు టీడీపీ హయాంలో రూ.256 లక్షలతో అభివృద్ధి పనులు, రూ.62లక్షలు రుణమాఫీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి, అమడాల మద్దిలేటి, వల్లంపాడు సర్పంచ్ గార్లపాటి జగదీశ్వర్‌రెడ్డి,, లింగాల నాయుడు, బిజనవేముల హుసేని, చిన్నకొప్పెర్ల బుచ్చెన్న, గోవిందిన్నె బాలరాజు, రేవనూరు ఏవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

'నియోజకవర్గ అభివృద్ధికి చంద్రబాబు హామీ'

బనగానపల్లె: బనగానపల్లె నియోజకవర్గ అభివృద్ధికి చంద్రబాబు హామీ ఇచ్చారని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెద్దకొప్పెర్ల ఎత్తిపోతల పథకం, జోలదరాసి రిజర్వాయర్‌ను పూర్తి చేస్తామని, బనగానపల్లె పట్టణంలో బైపాస్ రోడ్డు, కోవెలకుంట్లలో బైపాస్ రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారన్నారు. అలాగే వైసీపీ హయంలో కుదేలైన నాపరాయి పరిశ్రమను ఆదుకుంటామని చంద్రబాబు హామీ ఇచ్చి ప్రకటన కూడా చేశారని గుర్తు చేశారు.

● కొలిమిగుండ్లలో శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీసీ జనార్దన్‌రెడ్డి గురువారం తెలిపారు. కొలిమిగుండ్లలో నిర్వహించే ఈసదస్సుకు భారీగా హాజరు కావాలని టీడీపీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

● బనగానపల్లె పట్టణంలో అర్హులైన పేదలందరికీ రెండు సెంట్ల స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇస్తామని బనగానపల్లె టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. గురువారం బనగానపల్లె పట్టణంలోని కొండపేటలోని అమ్మవారిశాల వీధిలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో గురించి వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో భరించ లేని స్థితిలో ఉండి ఇబ్బంది పడుతున్నారన్నారు. వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలని ఆమె పిలుపునిచ్చారు. వైపీపీ పాలనలో రాష్ట్రం అవినీతిలో మునిగిపోయిందని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శిరివెళ్లలో..

శిరివెళ్ల: అరాచక పాలన సాగిస్తున్న వైసీపీని రాష్ట్రం నుంచి తరిమేయాలని టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి పిలుపునిచ్చారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా శిరివెళ్లలోని బెస్త కాలనీలో గురువారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు అందించబోయే సంక్షేమ పథకాలు, రాష్ట్రంలో జరిగే అభివృద్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళి, మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప, మాజీ ఎంపీటీసీ కొండబోయిన బాలచంద్రుడు, సూరా రామ, బీసీ ఖాజా హుసేన్, పీపీ లింగమయ్య, బీఎండీ రఫి, అబూబకర్ సిద్ధిఖ్, యామా శ్రీనివాసులు, తిరుమల రవి, బీసీ ఫిదా హుసేన్, ఉల్లి వెంకట సుబ్బయ్య, వేణుగోపాల్‌రెడ్డి, శివరామిరెడ్డి, రామనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఒకరికి ఒక చోటే ఓటు ఉండాలి'

చాగలమర్రి, జనవరి 11: ఒకరికి ఒకచోట మాత్రమే ఓటు ఉండాలని, ఒకటికంటే ఎక్కువ చోట్ల ఓట్లను కలిగి ఉంటే చర్యలు ఉంటాయని తహసీల్దార్ శుభద్రమ్మ హెచ్చరించారు. గురువారం చాగలమర్రి తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలు, వీఆర్వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ తెలంగాణలో ఓటు వేసి ఇప్పుడు అక్కడ తొలగించుకొని ఇక్కడ నమోదు చేసుకుంటున్నారంటూ ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో జాగ్రత్తగా పరిశీలించనున్నట్లు తెలిపారు. తప్పుడు స్టేట్‌మెంట్ సమర్పించి ఓటు నమోదు చేసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. బీఎల్‌వోలు రెండు ఓట్లు కలిగి ఉన్న వాటిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఓటర్ల జాబితాను పకడ్బందీగా తయారు చేయాలని ఆదేశించారు. స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణకు బాధ్యతాయుతంగా వీఆర్వోలు, బీఎల్‌వోలు పని చేయాలని సూచించారు. గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల సౌకర్యాలను పరిశీలించి ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. డీటీ విజయ్‌కుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆటో, బైకు ఢీ.. ఏడుగురికి గాయాలు

కోవెలకుంట్ల, జనవరి 11: కోవెలకుంట్ల పట్టణంలోని ముదిగేడు రహదారిలో ఏపీ గోడౌన్ సమీపంలో గురువారం ఆటో, బైకు ఢీకొన్న ఘటనలో ఏడుగురికి గాయాలయ్యాయి. దొర్నిపాడు మండలంలోని క్రిష్టిపాడు గ్రామానికి చెందిన నాగూర్‌బాషా, పెద్దఇమామ్, చిన్న ఇమాంమ్, షరీఫ్‌తో పాటు మరో ఆరుగురు కలిసి అవుకు మండలం సంగపట్నం గ్రామంలో బేల్దార్ పనికి వెళ్లారు. పనులు ముగించుకొని తిరిగి సాయంత్రం స్వగ్రామానికి బయలుదేరారు. అవుకు మండలం శింగనపల్లె గ్రామానికి చెందిన వెంకటసుబ్బారెడ్డి కోవెలకుంట్లలో పని ముగించుకొని బైకుపై స్వగ్రామానికి బయలుదేరారు. అయితే కోవెలకుంట్ల సమీపంలోని ఏపీ గోడౌన్ వద్ద ఆటో, బైకు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. బైక్‌పై ఉన్న వెంకటసుబ్బారెడ్డి ఎగిరి కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డారు. ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో అందులో ఉన్న నాగూర్‌బాషాకు తీవ్ర గాయాలయ్యాయి. పెద్ద ఇమాంసా, చిన్న ఇమాంమ్‌సా, సుభాన్, షరీఫ్, హుసేన్‌వలి స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి అక్కడ ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం నాగూర్‌బాషా, పెద్దఇమామ్, చిన్న ఇమామ్‌ను నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వెంకటసుబ్బారెడ్డి పరిస్థితి కూడా విషమంగా ఉంది. ఎస్ఐ వెంకటరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీని తరిమేయడం ఖాయం: సుబ్బారెడ్డి



డోన్, జనవరి 11: టీడీపీ అధినేత చంద్రబాబు చేపట్టిన రా..కదిలిరా కార్యక్రమంతో వైసీపీని ప్రజలు తరిమేయడం ఖాయమని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సీయం జగన్ రాష్ట్ర ప్రజలకు చేస్తున్న ద్రోహాలు, అన్యాయాలపై చంద్రబాబు చేస్తున్న పోరాటంతో వైసీపీకి పరాజయం తప్పదన్నారు. వైసీపీ నాయకుల అవినీతి వలన ప్రజలు నష్టపోయారన్నారు. ఒక్క చాన్స్ పేరుతో జగన్ రాష్ట్రాన్ని లూటీ చేశారన్నారు. మోసపు హామీలతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆళ్లగడ్డలో జరిగిన చంద్రబాబు సభకు లక్షలాది ప్రజలు వచ్చారంటే టీడీపీ, జనసేనా ప్రభుత్వం రావడం ఖాయమని అన్నారు.

టైరు పగిలి పొలంలోకి దూసుకెళ్లిన కారు

● ముగ్గురికి గాయాలు


పొలంలోకి దూసుకెళ్లిన కారు

కోవెలకుంట్ల, జనవరి 11: కోవెలకుంట్ల పట్టణంలోని భీముని పాడు రహదారిలో కారుటైరు పగిలి పొలంలోకి దూసుకొళ్లి పల్టీలు కొట్టింది. అందులో ప్రయాణిస్తున్న ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ తిరుపాలయ్యతో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి.

నేడు ముస్లింల సదస్సు

బనగానపల్లె, జనవరి 11: బనగానపల్లె పట్టణంలోని ధనలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ముస్లింల పురోగతి ఎప్పుడు, ఎలా అన్న అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు న్యాయవాది అబ్దుల్‌ఖైర్ గురువారం తెలిపారు. బీఆర్‌సీరాజ్ ఉర్ రహిమాన్ ఆధ్వర్యంలో ప్రసంగం ఉంటుందని చెప్పారు. సమాజంలో ముస్లిం యువత ఉద్యోగాలు లేక ఎన్నో అవస్థలు పడుతున్నారన్నారు. మహమ్మద్ ప్రవక్త బాటలో నడవాలన్నారు. కులమతాలకు అతీతంగా ఈ సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జాహిదహుసేన్, అబ్దుల్‌ఫైజ్, డాక్టర్ మహమ్మద్‌హుసేన్, సైకిల్‌షాపు మాబూవలి, సాదక్, హైదర్, పాన్‌బీడా వలి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లకు ప్రోత్సాహక బహుమతి


ప్రోత్సాహక బహుమతి అందిస్తున్న డీఎం తిరుపతయ్య

కోవెలకుంట్ల, జనవరి 11: కోవెలకుంట్ల ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న డ్రైవర్లకు ప్రోత్సాహక నగదు బహుమతులు డీఎం తిరుపతయ్య గురువారం అందించారు. డిపోలో ఉత్తమ డ్రైవర్లుగా ఎంపికైన ఓబలేసు, ప్రసాద్, నరసరాజులకు ప్రోత్సాహక బహుమ తులు అందించారు.

ఆంజనేయ స్వామికి అభిషేకం


ఆంజనేయస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ, జనవరి 11: అహోబిలం లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో వెలసిన బీగాల ఆంజనేయస్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రహ్లాద వరదులు, ఉభయ దేవేరులైన శ్రీదేవి, భూదేవిని బీగాల ఆంజనేయస్వామి వద్దకు అర్చకులు ఉదయాన్నే చేర్చారు. అక్కడ ప్రహ్లాద వరదులకు నవ కలశ స్నపన అభిషేకం, సాయంత్రం తిరువడి కోవెలలో హనుమజ్జయంతి విశేష ఆస్థానం, గోష్టి కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

కొనసాగుతున్న ధనుర్మాస పూజలు

అహోబిలంలో ధనుర్మాస పూజలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం వేకువజామున్నే ఉత్సవమూర్తులైన ప్రహ్లాద వరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో పాటు గోదాదేవి అమ్మవారికి తిరుప్పావై, సేవాకాలం, శాత్తుమురై, గోష్టి కార్యక్రమాలను నిర్వహించారు.

రుద్రవరం: రుద్రవరంలోని పడమటి వీధిలో కొలువుదీరిన ప్రతాపరుద్ర ఆంజనేయస్వామి దేవాలయంలో గురువారం రాత్రి అమావాస్య పూజలు చేశారు. అర్చకులు వారణాసి గోపిశర్మ ఆంజనేయుడికి అభిషేకం చేసి తమలపాకులు, తులసి దండలతో అలంకరించారు. అయ్యప్పస్వామి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

సాయిబాబాకు పూజలు


చాగలమర్రిలో సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

చాగలమర్రి, జనవరి 11: చాగలమర్రి గ్రామంలోని సాయినాథ మందిరంలో గురువారం ధనుర్మాసం సందర్భంగా వేద పండితుడు పవన్‌కుమార్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం, పుష్పాభిషేకం చేశారు. మహిళలు సామూహికంగా సాయివ్రతం, పల్లకీ ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, సుబ్బారావు, నాగభూషణం, రఘురామ్, మహిళలు పాల్గొన్నారు.

రుద్రవరం: రుద్రవరం, చందలూరు గ్రామాల్లో గురువారం సాయినాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. చందలూరు గ్రామంలో సాయినాథుడి విగ్రహానికి అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. రుద్రవరంలో సాయినాథుడి చిత్రపటానికి పూలమాలతో అలంకరించారు. భక్తులు సాయినాథుడిని దర్శించుకున్నారు.